# ప్రగల్భప్రేతము

## (జాతక కథ)

'చక్రపాణి'

[ముసురుగా ఉన్న ఒకనాటి సాయంకాలం, జేతవనంలో కూడిన భిక్షువులు అనాథపిండదుని వద్దకు వెళ్లి – "సత్తమ! ఈ మనోహరమైన వర్షాసంధ్యలో మాకొక చక్కని భూతాలకథ చెప్ప"దని కోరగా వారీ క్రింది కథను చెప్పిరి.]

వారణాసిని బ్రహ్మదత్తుడను రాజు పాలిస్తూవుండగా పీతశ్రీ అను ముసలిబ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి సతృష్ణ అను పడుచుభార్య కలదు. ఒకప్పుడు పెద్ద భూకంపం వచ్చి బ్రాహ్మణుని ఇల్లు కూలిపోయినది. బ్రాహ్మణి ఇంటిలోనుంచి తప్పించుకోలేక అందులోనే అణగిపోయి ప్రేతయోని పొంది, ఊరిబయట చెరువుగట్టున ఉన్న మారేడుచెట్టుమీద నివసింపనారంభించినది.

ఆ చెట్టుకు సమీపంలోనే ఒక పడుచుగొల్లవాని నివాసంకూడా. ఒకనాడు వానిభార్య చెరువుకు స్నానానికి రాగా ప్రేతం ఆమెను ఆవేశించింది గోపాలుడు భార్యలోని భావవైలక్షణ్యము చూసి చాల చింతితుడై గొప్ప గొప్ప రాజవైద్యులను చికిత్సకోసం రావించాడు. వైద్యుల్లు అనేకమందు లిచ్చికూడా రోగాన్ని కుదర్చలేక "ఇది మందులకు లొంగేరోగము కాదు; గాలిచేష్ట భూతవైద్యులను పిలిపించుకో"మ్మని చెప్పిపోయినారు.

తర్వాత గోపాలుడు ప్రఖ్యాతి చెందిన భూతవైద్యులను కొందరిని పిలిపించాడు. వారిని చూడగానే గోపాలునిభార్య ఉగ్రరూపంధరించింది; కళ్లెర్రచేసి ఉరిమి చూసింది, పళ్లు పటపట కొరికింది, నుప్పిడి బిగబట్టి తుప్పునఉమ్మేస్తూ నోటికి వచ్చిన తిట్లెల్లాతిట్టి "మీరిక్కడికి చావటానికి వచ్చారా? వెంటనే పారిపొండి; లేకపోతే మీ మెడలు విరగగొడతాను!" అని గద్దించింది.

ఇది చూసి భూతవైద్యులు పరస్పరము పరామర్శచేసుకుని "ఈమెను తప్పక మ్లేచ్ఛభూతం ఆవేశించి ఉంటుంది. దీన్ని వదలించటం మనవల్ల కాదు. ముఖ్యంగా దీనిమోటుప్రవర్తనా, భయపెట్టేపద్ధతీ చూచికూడా దీనిజోలికి పోవటం బుద్ధిమంతుల పనికాదు. కాబట్టి మనం ఈక్షణానే ఇక్కడనుంచి వెళ్లటం మంచిది" అనిస్థిరపరుచుకున్నారు.

వీరినిర్ణయం విని ముసలిభూతవైద్యుడొకడు క్రుద్ధుడై ఈక్రిందికవిత చెప్పాడు:

ఎంత చిత్రమైన మాటలాడుచుంటి రయ్యలో!
ఇలలో భూత మెక్కడైన భూతవైద్యు దెగడుటా!
గాన మీరలెల్ల దూరముగను, నుండి చూడుడీ
గురునికృపచే నీక్షణంబె పారదోలెద భూతమున్.

తర్వాత భూతవైద్యుడు మంత్రించిన ఆవాలు గుప్పిట పట్టుకుని గోపాలునిభార్యవద్దకు పోగా, ఆమె "ఓరీ ముసలిపీనుగా! నీకు కాలం సమీపించింది, కాచుకో!" అని ఆడుపులివలె అతనిమీదికి లంఘించి, బుజాలురెండూ గోళ్లతో పట్టుకుని, ముక్కుకొన గట్టిగా నోట లంకించుకున్నది. భూతవైద్యుడు మహాప్రయాసతో ఆమెపట్టు వదలించుకొని, వెంటనే, తిరిగిచూడకుండా పారిపోయినాడు. అతనివెంబడే మిగతాభూతవైద్యులుకూడా కుక్కవెంటపడితే కుందేళ్లుపారిపోయినట్టుఎవరిదారినవారే మాయమైనారు. ఆతర్వాత సాహసించి ఎవ్వరూ భూతాన్ని వదలిస్తామని రాలేదు. పాపం గోపాలునికి మనశ్శాంతిలేదు. సుఖమనేది ఎరుగకుండా కాలం గడుపుతున్నాడు. క్రమంగా ఈసంగతి చాలా దూరం వ్యాపించింది.

ఆకాలంలో బుద్ధభగవానుడు జితధీ అను పేరుతో అవతరించినాడు. పుట్టినదాది అధ్యయనమూ, జ్ఞానచర్చా చేయడంచేత వారికి ప్రతివిషయంలోనూ గంభీరమైన అంతర్ దృష్టి కలిగింది. జ్ఞాని అని వారికీర్తి దేశ విదేశాల్లో వ్యాపించింది. ఒకనాడు వారు ఏదో కార్యార్థమై ఈచోటికి రాగా, గోపాలునికి తెలిసి వారిదగ్గరకు పోయి - తన్ను ఈ ఆపదనుంచి రక్షించమని వారిని వినయంగా బలవంతపెట్టినాడు. వాని ప్రార్థన తోసివేయక శాస్త (బుద్ధభగవానుడు) శిష్యులతో గోపాలునియింటికి వచ్చినాడు.

గోపాలుని ఇంటిముంగిలిలో అడుగుపెట్టగానే స్ఫురితాధరతరుణి ఒకతె రెప్పవాల్చకుండా కిటికీలోనుంచి తన్ను చూస్తూ ఉండటం శాస్త కనిపెట్టినాడు. గోపాలుని యింటిలో అతనిభార్యమినహా ఇక స్త్రీలెవ్వరూ లేరని శాస్త ముందుగానే తెలుసుకున్నాడు. అందుచేత ఈమెగోపాలునిభార్య అని స్థిరపరచుకొని, ఇతరులు చూడకుండా ఆమెవంక చూసి మందహాసముచేసి తల కొంచెం ఎగుర వేసినాడు. తరుణి కిటికీలోనుంచి వెళ్లిపోయింది. అప్పుడు శాస్త శిష్యులతో "మీరికపోయి ఊరిబైట ధర్మశాలలో భోంచేసి, నాకోసం వేచి ఉండండి. త్వరలో నేను వచ్చి కలుస్తాను" అని చెప్పి పంపి, గోపాలునితో "నిన్ను కొన్నిమాటలు అడగవలసి ఉన్నది" అన్నాడు.

"సెలవివ్వండి" అన్నాడు గోపాలుడు.

"ఈ రోగంసంగతి నేను విన్నాను. మామూలుపనిపాటల్లో నీభార్యలో ఏమీ మార్పు ఉండకూడదని నానమ్మకం. ప్రవర్తనలో పూర్వానికీ ఇప్పటికీ ఏమైనా మార్పు లుంటే చెప్పు."

"తమరు సర్వజ్ఞులు. తమరు చెప్పినదంతా నిజం. పూర్వానికీ ఇప్పటికీ పనిపాటల్లో ఎక్కువమార్పు లేమీ లేవు వెనకటికంటె ఇప్పుడు కొంచెం ఆచారమూ శుచీ ఎక్కువైంది. గృహకృత్యాలు చక్కగానే నిర్వర్తిస్తూఉంటుంది. భూతవైద్యులను చూస్తే మాత్రం ఉత్తేజితురాలవుతుంది. ఇకపట్టపగ్గాలుండవు. ఇంకా—"

"ఇంకా?"

గోపాలుడు తలవంచుకొని "ఇది తప్పుగా ఎంచకండి దేవా! పూర్వం నాభార్య చాలా సిగ్గు కలది. ఈరోగం వచ్చినప్పటినుంచీ వాగుడూ కాముకతా ఎక్కువైపోయినవి. అలంకరణ అంటే మహాప్రీతి; ఎప్పుడూ సాహచర్యం కోరుతూ ఉంటుంది; గురుజనులు ఉన్నాకూడా. నాదగ్గరకు వచ్చికూర్చోటానికి సిగ్గుపడదు" అన్నాడు.

"ఇక ఈవ్యాధి సంగతంతా నాకు తెలిసింది. కుదర్చగలను. కాని నేను చెప్పినట్టు నీవు నడుచుకోవలసి ఉంటుంది."

"చిత్తం. తమసెలవుప్రకారం నేను—"

"నేను చికిత్సచేయటానికి వచ్చినానని నీవు ఎవ్వరికి చెప్పకూడదు. నేను అందాకా ఇక్కడే ఉంటాను. నీవు ఇంట్లోకి పోయి 'బాటసారి ఒకడు మనఇంటికి అతిథిగా వచ్చా' డని చెప్పు. నీఇంట్లో ఒకగది నాకివ్వాలి. మధ్యాహ్నం భోజనం అయినాక నీ భార్య నాకు తాంబూలం తెచ్చి ఇచ్చేటట్టుగా చూడాలి; అక్కడ జరిగే తంతు అంతా నీవు పక్కగదిలో ఉండి చూడవచ్చును."

ఈ విధంగా గోపాలునిచేత ఒప్పించుకొని శాస్త గోపాలునిఇంట అతిథిగా ప్రవేశించినాడు.

భోజనంచేసి శాస్త ప్రక్కమీద విశ్రమిస్తూ ఉండగా, గోపాలునిభార్య వారికోసం సుగంధద్రవ్యాలు వేసి చాలా శ్రద్ధగా తాంబూలం తయారుచేసి తెచ్చింది. శాస్త తాంబూలం చేత్తో తీసుకుని "భద్రా! కొంచెంచల్లనిపానీయం తెచ్చిపెట్టగలవా?" అన్నాడు.

గోపాలునిభార్య లోపలికి పోయి లోటాతో నీళ్లూ, చక్కెరా, నిమ్మపండూ తెచ్చి, నట్టింట కూర్చుని నెమ్మదిగా పానీయం తయారుచేయ నారంభించింది. ఆమె ఇచ్ఛాపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నదనీ, ఆమెచేతులు పనిచేస్తున్నప్పటికీ కళ్లు రెండూ తనమీదనే ఉన్నవనీ శాస్త గ్రహించి ఆమెవంక రెప్పవాల్చకుండా చూడనారంభించాడు. గోపాలునిభార్య వారివంకనే చూస్తూఉండటంచేత వారిసమ్మోహనశక్తికి వశ్యురాలైపోయింది.

"నీ విప్పుడు నా ఇచ్ఛాశక్తికి పూర్తిగా లొంగి పోయినావు. నేను ఏశక్తితో నిన్ను కట్టివేశానో దాన్ని జయించటం నీకు సాధ్యం కాదు. నేను అడిగినవాటి కల్లా నీవు జవాబివ్వు. స్వేచ్ఛగా మాట్లాడటానికి నేను నీకు స్వాతంత్ర్యం ఇచ్చాను."

గొల్లవానిభార్యకు స్మృతి లేదు యంత్రచాలిత వలె "సెలవివ్వండి" అన్నది.

అప్పుడు శాస్త్రి, ప్రక్కగదిలోనుంచి తొంగి చూస్తూవున్న గోపాలుని పిలిచి "నీ భార్యను ఆవేశించిన భూతాన్ని నేను నా ఇచ్ఛాశక్తితో వశపరుచుకున్నాను. ఈక్షణానే దాన్ని పారదోలగలను. కాని, ఎంతో కాలంనుంచి నేను ఏసుయోగంకోసం వేచిఉన్నానో అది నేడు సిద్ధించింది. ఈ భూతాన్ని నేను కొన్ని ప్రశ్నలు అడగా లనుకుంటున్నాను. నీ వీ ప్రశ్నోత్తరాలు విని ఏమాత్రం విచలితుడవు కావద్దు. కారణం, నాతో మాట్లాడేది పైకి నీ భార్యగా కనపడినా నిజానికి ఆమె కాదు. ఆమెను ఆవేశించినభూతమే నాకు జవాబిస్తుంది. నీవు ఇక్కడకు వచ్చి కూర్చో, నీవు లేకుండా నేను నీ భార్యదగ్గర ఎక్కువసేపు ఉండటం, లోకదృష్టిలో బాగుండదు" అని, ఆతర్వాత శాస్త్రి ప్రేతాన్ని సంబోధించి "నీ వెనకటిచరిత్ర అంతా నాకు తెలుసును. నీవు మారేడుచెట్టుమీద ఉంటూ గోపాలునిభార్య స్నానం చేయటానికి రాగా పూనినావు. కాని, నీ వెందుకు ఈమెను పూని కష్టపెట్టుతున్నావు? ఈమె మీద నీ కింతకోపం కలగటానికి కారణం ఏమిటి?" అని అడిగినాడు.

గోపాలునిభార్య అంటే ప్రేతం మందహాసం చేసి "మీ జ్ఞానం ఇంతమాత్రమే అయితే మీకు నేర్పిన గురువులమీద కూడా నాకు గౌరవం ఉండదు, మీ మనోబలానికి నేను వశ్యురాలనైనప్పటికీ" అన్నది.

"ప్రగల్భాలు కట్టిపెట్టి నే నడిగినదానికే జవాబు చెప్పు" అన్నాడు శాస్త్రి గద్దించి. "నీ ఆచారాలూ, నీరుచీ, నీ అలంకరణపద్ధతీ చూస్తే, నీవు నీచజాతికి చెందినదానివి కావని స్పష్టంగా తెలుస్తున్నది. బహుశా నీవు ఉత్తమజాతి కన్యవు కావచ్చును. ఈ గొల్లపిల్లను ఎందుకు ఆవేశించావు?"

ప్రేతం మరల నవ్వి, వారిమీద ఒక కటాక్షబాణం విసరి—"సరిగ్గా కనిపెట్టారు. నేను ఉత్తమజాతికన్యనే! దరిద్రకుటుంబంలో నా జీవితమంతా గడిచింది. పాలూ పెరుగూ నెయ్యీ నే నెన్నడూ చవిచూచి ఎరుగను. ఇప్పుడీమెను ఆవేశించి ఆతీరనికోరికను తీర్చుకొంటున్నాను. ఈమెమీద నాకు ఎంతమాత్రం కోపంలేదు. ఉన్నట్లయితే ఈమెశరీరాన్ని ఈ విధంగా అలంకరించే దాన్నే కాను" అన్నది.

ఇక వీటితో లాభంలేదని శాస్త్రి గ్రహించి — "అమ్మా! స్త్రీలమనస్సును గుప్తచరులుకూడా తెలుసుకోలేరు. ఇక నేనా మానవమాత్రుణ్ణి. సరే, నీతో నే నొకరాజీకి ఒప్పుకుంటాను. నీవు నా అధీనంలో ఉన్నావు. ఈ గోపాలునిభార్యను నీవు వదలక తప్పదు. దానికిబదులు నీకు, ఈ ప్రేతయోనినుంచి విముక్తికలిగే ఉపాయం చెప్తాను. నీకు ఇష్టమా, అయిష్టమా?" అని అడిగాడు.

ప్రేతం చాలాసేపు ఆలోచించి, చివరకు— "ఇష్టమే" అన్నది.

"అయితే దీనికిబదులు నీవు నా కొకసహాయం చేయాలి. నేను చాలా అధ్యయనమూ, చింతనా చేసికూడా, ప్రేతాలు మనుష్యుల్ని ఎందుకు ఆశ్రయిస్తాయో, సరైన నిర్ణయానికి రాలేకుండాఉన్నాను; ఈ విషయం నీవు నాకు ఉపదేశించాలి. నేను నిన్ను కొన్ని ప్రశ్నలు అడుగుతాను, జవాబివ్వు. నీకు ముక్తిలభించే ఉపాయం నేను చెప్పతాను."

"అలాగే ప్రశ్నించండి" అన్నది ప్రేతం.

"అయితే విను. పాలూ పెరుగులమీద ఉన్న కోరిక తీర్చుకోవటానికే ఈమెను ఆవేశించా నని నీవు చెప్పతున్నావు. ఇందులో కొంత సత్యముం దని నేను ఒప్పుకుంటాను; కాని అంతా నిజంకాదు. ఏమంటావు?"

ప్రేతం మాట్లాడలేదు. శాస్త్రి చెప్పనారంభించాడు:

"ఏదైనా తీరనికోరిక మనస్సులో పెట్టుకొని చనిపోయినట్లయితే ఆత్మకు ముక్తి లభించదు; ఆతీరని కోరికను తీర్చుకోవటంకోసం ప్రేతం బ్రతికి ఉన్న

మనుష్యులను ఆశ్రయిస్తూఉండవచ్చని, నేను అనేక సార్లు అనుకున్నాను. మరణదండనకు పూర్వం దండితుని ఆఖరుకోరిక నెరవేర్చాలని శాస్త్రాల్లో ఉన్నది. బహుశా దీనికికూడా మూలకారణం పైదే కావచ్చును. నీకూ ఏదో అతృప్తి ఉంటుందని నేను ఒప్పుకుంటాను. కాని నీవు చెప్పినకోరిక నాకు సబబుగా కనిపించటం లేదు. బ్రహ్మదత్తునిరాజ్యంలో పాలూ పెరుగూ లభించనిదరిద్రుడు ఎవ్వడూ లేడు. అందులో ఉత్తమజాతివారసలే లేరు. దీన్నిబట్టి నీ అతృప్తిపాలూ పెరుగులకు సంబంధించింది కాదని తేలిపోయింది. ఏమంటావు ?"

ప్రేతం మాట్లాడాలని కొంచెం ఊగులాడింది. కాని మాట్లాడలేదు.

"ఇంతేకాక, ఒకమాటు దేహం వదలిపెట్టినటువంటి ఆత్మ, మళ్లీ తనకై తాను ఇంకొకరి దేహంలోకి వచ్చి బంధింపబడుతూ ఉందంటే, దానికారణం ఎంత బలవత్తరమైనదో మనం ఊహించుకోవచ్చు. మామూలు జిహ్వాచాపల్యంకోసం అది ఇంత శ్రమపడదు. నేను మరొకవిషయంకూడా గమనించాను. ఎప్పుడూ మగప్రేతాలు పురుషుల్నీ ఆడుప్రేతాలు స్త్రీలనీ ఆవేశిస్తూ ఉంటాయి. దీనిలో తప్పక ఏదో విశేషం ఉండితీరుతుందని నానమ్మకం. అదేమిటో నీవు నాకు చెప్పాలి."

ప్రేతం కలవరపాటుచెంది, ఎవరన్నా ఉన్నారేమోనని చుట్టూ ఒకమాటు కలయచూసింది. తర్వాత మెల్లగా "ప్రేతాన్ని అయినప్పటికీ నేను స్త్రీని. అన్నిసంగతులూ మీబోటి మగవారిదగ్గర చెప్పలేను" అన్నది.

"నేను నీదగ్గర జ్ఞానసంబంధమైన ఉపదేశం పొందుతున్నాను; నీకూ నాకూ గురుశిష్యసంబంధమే ఉన్నది. కాబట్టి నీవు ఏమాటైనా నాకు చెప్పటానికి సంకోచించటం భావ్యంకాదు. సరే, అలాగైతే టూకీగా చెప్పుకుపో, నేను గ్రహిస్తాను."

"దేవా! ప్రేతం స్త్రీని ఆశ్రయించబోయేముందు, ఈడు మిసలనిదీ, మంచి శరీరపుష్టికలదీ, పడుచు భర్తకలదిగానూ చూసుకుంటుంది. దీన్నిబట్టి మీప్రశ్నకు జవాబు గ్రహించుకోండి."

"గ్రహించాను. కాని, నీవు ఉత్తమజాతిదానవు కదా, ఎవరైనా అట్టి ఉత్తమజాతి వధువునే చూసి ఆశ్రయిస్తే బాగా ఉండేది. మరి నీవు ఏ ఉద్దేశముతో ఈ గోపకన్యను ఆశ్రయించావు ? ఇది నీ సురుచినీ, వర్ణవైశిష్ట్యాన్నీ వెల్లడించటం లేదు."

ప్రేతం తలవంచుకొని "దేవా! ప్రేతలోకంలో జాతిభేదం లేదు. అక్కడ అంతా సమానులే" అన్నది.

"ఇదిగో, మళ్లీ మోసపుచ్చాలని చూస్తున్నావు. నేను ప్రేతాన్ని కాకపోయినా, ప్రేతలోకానికీ వాటి ఆచారాలకూ సంబంధించిన విషయాలు చాలా తెలుసుకున్నాను. అక్కడకూడా బ్రహ్మరాక్షసి వగైరా సమాజభేదాలు ఉన్నవి. మానవుడు ప్రేత మయినంత మాత్రంచేత స్వభావగతమైన సంకీర్ణతను వదిలిపెట్టలేడు. పోనీ, అక్కడ జాతిభేదంలేదనే అనుకుందాము. ఇక్కడ ఉన్నదిగా! చనిపోయిన గోపాలుని ప్రేతమూ బ్రతికి ఉన్న గోపాలుడూ ఒకరు కారు. కనీసం ఈ సంగతైనా నీవు తెలుసుకునిఉంటే బాగుండేది."

ప్రేతం తలవంచుకునే "దేవా! నేను చెప్పింది అసత్యమే. నాది చాలా అకాలమృత్యువు. అతృప్తకామవాసనకు తాళలేక నేను అస్థిరురాలనైనాను, దానితో పోరాడి జయించేశక్తి నాలో లేదు. చాలాకాలంనుంచి నా కిలాంటిసుయోగం దొరకలేదు. అందుచేత ఈ గోపకన్య కనిపించగానే, ఈమెను ఆశ్రయించకుండా ఉండలేకపోయినాను" అన్నది.

శాస్త్రి—"నీవు మొదటినుంచీ అబద్ధాలే చెప్పుతున్నావు. నీ సంగతిఅంతా నేను ఎప్పుడో ఊహించి తెలుసుకున్నాను. అకాలమృత్యువువల్ల లభించిన ప్రేతత్వాన్నించి సులభంగానే ముక్తి పొందవచ్చు; కాని, నీవు చేసినపాపానికిమాత్రం పరిహారం సులభం కాదు. అసలు, నీ అంతరంగంలో ఇంతవరకూ అనుతాపం కలగలేదు; నీవు చేసినపాపం చాలక ఇంకా పెద్దపాపం చేయటానికి సిద్ధమైనావు. పైగా అన్నీ అబద్ధాలు."

"నన్ను క్షమించండి" అన్నది ప్రేతం ఏడుస్తూ.

శాస్త్రి సమయోచిత గాంభీర్యం అవలంబించి "క్షమించవలసినవాణ్ణి నేను కాను. నీవు సంయమంలేని

పాపిష్ఠవు, భౌతిక దేహంలో నీలాలస తీరలేదు ప్రేత దేహంలో, అది తీర్చుకోవాలని చూచావు. ఈ పాపాచరణకు అవలంబనంగా ఎవరిని ఆశ్రయించావో ఆమెను కూడా సర్వనాశనం చేయటానికి సిద్ధపడినావు. నిజానికి ఈ బాలికఏమీ అన్నెం పున్నెం ఎరుగదు.”

ప్రేతం “ దేవా! నన్ను తిట్టండి. కాని, నామీద మిథ్యాదోషాలు ఆరోపించకండి. ఈగోపకన్యకు నే నేమీ చెరుపుచేయలేదు. పైగా, ఈమెను నాశక్తి కొలది అలంకరించటానికి ప్రయత్నించాను ”

శాస్త “ ఇది నీస్వార్థం. గోపాలుని ఆకర్షించటానికి, ఈమెహితార్థం కాదు. నీమోహంలో నీవెంత అంధురాలవైనావంటే, ఈమెకు ఎంత చెరుపుచేయబోతున్నావోకూడా తెలుసుకునేశక్తి నీకు లేకుండాపోయింది.”

ప్రేతం జిజ్ఞాసుదృక్కులతో వారివంక చూసింది.

శాస్త “బహుశా, నీవు ఈ దేహంతో ఇంతవరకు ఈమెభర్తమినహా అన్యపురుషులసాంగత్యం చేసి ఉండకపోవచ్చును. కాని, ఇవ్వాళ నేను ఇంటిముంగిట అడుగుపెట్టగానే, నీచూపు నామీదనే ఉండటం చూశాను. నీలాలసదృక్కులు చూడగానే నేను సంగతంతా అవగాహన చేసుకున్నాను. నిజానికి, నేను ఎవరినో ఏజాతివాడినోకూడా నీకు తెలియదు. తర్వాత, తాంబూలం ఇచ్చేనెపంతో నీవు నాదగ్గరికి వచ్చినప్పుడు కూడా నీ మనస్సులో లాలసే ప్రబలంగా ఉన్నది. ఇలా జరుగుతుందని తెలిసే, నిన్ను ఈవిధంగా పంపమని గోపాలునితో చెప్పాను.”

“అంతేనా!” అన్నది ప్రేతం శ్వాస బిగించి.

“ఆఁ, నీవు బాగా మోసపోయావు. ఇక ఇప్పుడు దానికోసం పశ్చాత్తాపపడికూడా లాభం లేదు. ఇటు చూడు; నీ విచ్చినతాంబూలం ఇంకా నాచేతిలోనే ఉన్నది; దీంట్లో వశీకరణ ఓషధి ఉండవచ్చుననే సందేహంతో నేనింకా వేసుకోలేదు. నీవు పానీయం తయారుచేసే నెపంతో, నావంక సిగ్గువిడిచినదానివలె రెప్పవాల్చకుండా చూచి, నా మనోబలానికి కట్టుపడిపోయావు. ఈ విషయంలోమాత్రం నీమోహాంధతే నాకు సహాయం చేసింది. కాని, నేను వేరుప్రకృతికి చెందినవాడనైతే నీ కోరికకు కబళమయేవాడినే. నీవు, నీలాలస తీర్చుకోవటంకోసం ఈ అభంశుభం ఎరగని బాలికదేహాన్ని పరపురుషునికి బలి ఇచ్చేదానివి. ఈ పాపం ఎవరికి అంటుకునేది?”

గోపాలునికి క్రమంగా శివం పెరిగిపోతూఉన్నది. శాస్త సైగతో అతన్ని వారించాడు.

ప్రేతం భూమిమీదపడి పొర్లుతూ—“ప్రభూ! దుఃఖితురాలిని. నన్ను క్షమించండి, మీ పాదాలు పట్టుకొంటున్నాను.”

శాస్త విద్యుద్వేగంతో వెనక్కు పోయి “ఇంకా ఈ దేహంతో పరపురుషుని స్పృశించాలనే! నీకు మన్ననకావలిస్తే, నీవు ఎవరిభార్యకు అపకారంచేశావో వారిదగ్గరకే పోయి క్షమించమని వేడు” అన్నాడు.

ప్రేతం గోపాలుని కాళ్లమీదపడి, తల విసురుగా నేలమీద కొట్టుకోనారంభించింది.

ప్రియురాలిదేహం దుమ్ములో పొర్లాడటంచూసి గోపాలుడు వ్యాకులుడై ఆమెను చేతులతో పట్టి ఎత్తపోయాడు. శాస్త “ఈ దేహాన్ని ఇప్పుడు ప్రేతం ఆశ్రయించి ఉన్నది. నీ విప్పుడు ఈమెను ముట్టినయెడల ప్రేతాన్ని ఆలింగనంచేసుకున్నట్లవుతుంది” అని నిషేధించాడు.

గోపాలుడు డగ్గుత్తికతో—“ దేవా! మూర్ఖుణ్ణి. అంతదూరం నేను ఆలోచించలేను. ఈమెబాధను నేను చూడలేకుండా ఉన్నాను. తమరు అనుగ్రహించి ప్రేతాన్ని వెంటనే వెళ్లగొట్టండి. మేము ఆ జన్మాంతం తమకు క్రీతదాసులుగా ఉంటాము” అన్నాడు.

శాస్త “కాని, ఈప్రేతాని కింకా తగినశాస్తి జరగలేదు. నీవు కొంచెం గట్టిగాఉన్న కొబ్బరి ఈనెల చీపురు తీసుకురా.”

గోపాలుడు “ అలా చేయకండి. ఆ దెబ్బలు దాని ఒంటిమీదనే పడతవి.”

ప్రేతం "ప్రభూ! ఆపనే చేయండి."

గోపాలుడు రోదనస్వరముతో "అలా ఎప్పటికీ జరగనివ్వను. తమయుక్తులూ తర్కాలూ నేను విన దలచలేదు. ఈదేహంలో ఇప్పుడు ఎవరిఆత్మ ఉన్నదీ తెలుసుకున్నందువల్ల నా కేమి వస్తుంది? నాకు తెలిసిందల్లా ఇది: ఈచేతులు రాత్రంతాకూడా నామెడకు పెనవైచుకుని తృప్తిపడలేదు. ఈవీపును నేను మొదటినుంచీ ప్రేమతో నిమురుతూ వస్తున్నాను. ఈజుత్తు..." అంటూఉండగానే అతని రెండుచెక్కిళ్లమీద అశ్రుధారలు ప్రవహించినవి. కళ్లు తుడుచుకొని మరల చెప్పనారంభించాడు "అంతకంటె, ఈ ప్రేతాన్ని వచ్చి నన్ను ఆవేశించమని ఆజ్ఞాపించండి. అప్పుడు మీఇష్టం వచ్చినట్టు నన్ను కొట్టుకోవచ్చును. నేను ఏమాత్రమూ ఆటంకపెట్టను."

ఈ మాటలు చెప్పి గోపాలుడు భార్యను వెనుక వేసుకుని శాస్త్రముందు మోకరిల్లినాడు.

శాస్త్ర గోపాలునికంక వేలు చూపిస్తూ, ప్రేతంతో — 'పాపిష్ఠురాలా! చూడు, నిష్ఠ అంటే ఏమిటో? ఇతనితో నీ వ్యభిచారప్రకృతిని పోల్చుకో! పైగా ఇతను పురుషుడు, నీవు స్త్రీవి. పాతివ్రత్యంలోనూ, నిష్ఠలోనూ ఉన్న గొప్పతనమే నీకు కనిపించలేదు!" అన్నాడు.

ప్రేతం మరల నేలమీద పొర్లాడుతూ "ప్రభూ! నన్ను క్షమించండి" అన్నది.

"నీ కింత త్వరలో నిష్కృతి కలిగించటం నా కిష్టంలేదు. కాని, గోపాలుని బలవంతంమూలాన అతని భార్యను సాధ్యమైనంతత్వరగా స్వస్థురాలిని చేస్తాను. ఈ పుణ్యాత్మురాలిదేహాన్ని ఆశ్రయించబట్టి నీ వింత తేలికగా తప్పించుకోగలిగావు. సరే, నీకు ముక్తివిషయమై సలహా చెప్పతానని మాట ఇచ్చాను. అది అయిన తర్వాత నిన్ను వదలిపెడతాను."

ప్రేతం "ప్రభూ! ఈ దుఃఖితురాలి ప్రగల్భతను మన్నించండి. నేను చేయలేనిది మీరు ఉపదేశిస్తే మాత్రం ఏమిలాభ ?"

శాస్త్ర "చేయలేనంటే అర్థం? రక్తమాంసాల దేహంతోకూడిన మానవుడే చిత్తసంయమమూ, ఇంద్రియ నిగ్రహమూ అవలంబించగలిగితే, నీవు వాయుమయ శరీరంతో అనుష్ఠింపజాలవా ?"

ప్రేతం తర్జని చూపుతూ "సన్యాసులకు మీకు ఏమి తెలుస్తుంది? మాకంటే మీకు చిత్తబలం అధికం; ఒకవేళ, మీకంటె మాలో వాసనాప్రభావం ఎక్కువ ఉన్నా, దానికి మమ్మల్ని బాధ్యుల్ని చేయటానికి వీలులేదు. చచ్చినాకూడా వారి వారి స్వభావాలు మారవు. ఈశ్వరుడు జీవులకు స్త్రీ పురుష దేహాలతో పాటు సంగలిప్సకూడా ఇచ్చినాడు. దోషమైనట్టయితే ఇచ్చేవాడే కాడు. దీన్నిబట్టి, ఇది మనం అనుశీలించటానికే ఇచ్చినాడని స్పష్టంగా తేలిపోతున్నది. ఈ స్వాభావికలిప్సను తోసివేయటం ఎవరితరమూ కాదు. దీని అస్తిత్వాన్ని ఒప్పుకోనివాడు ఈ స్వభావానికి వ్యతిరేకి అయినా కావాలి; లేక వంచకుడైనా కావాలి. దేవా! ఈ లిప్స రక్తమాంసాలతోకూడిన దేహాన్నికానీ, సంభవాన్నికానీ అపేక్షించదు. మానవునికి దైహిక సామర్థ్యంరావటానికి చాలాకాలంముందే ఇది చిత్తంలో ప్రవేశిస్తుందని పండితులు చెప్పుతున్నారు. దీనికి అధిపాశమహారాజు[1] వృత్తాంతమే ప్రమాణము. ఇక చనిపోయిన పిమ్మటకూడా ఇది నిలిచి ఉంటుంది అని చూపించటానికి దృష్టాంతంగా నేను మీయెదుటనే ఉన్నాను.

---

1. అధిపాశుడు ఒక రాజకుమారుడు. ఇతనిసంగతి ప్రాచీనగ్రంథాలలో ఉన్నది. ఇతను బాల్యంలోనే తల్లిని కామించి అపస్మారరోగగ్రస్తుడవుతాడు. ఇతనిచికిత్సకోసం మహామతి జీవకుని పిలిపించగా, వారు రోగికి గుడ్డలు విప్పదీయించి పిరుదులమీద అయిదువందల దెబ్బలు కొట్టమని ఆజ్ఞాపిస్తారు. ఈచికిత్సతో అధిపాశునిరోగం కుదురుతుంది. (నితంబాలలోని నరాలకూ కామోత్సారపద్మానికీ దగ్గరసంబంధం ఉన్నదని ఈ యుగంలోని వైజ్ఞానికులుకూడా ఒప్పుకుంటారు.) ఎడిపస్‌రాజు విషయమైకూడా, యూరోపియను గ్రంథాలలో ఇలాంటికథలు చాలా ఉన్నవి. కాని వాటిలో జీవకునిచికిత్స సంగతి లేదు. 'అధిపాశు'ని వికృతఉచ్చారణే ఎడిపస్ అని మనం సహజంగా ఊహించవచ్చును.

నిజానికి ఈలిప్స పుట్టటంకానీ ఉండటంకానీ మనస్సులో; కాయం దీనికి ఆధారం కాదు, కేవలం సాధనోపకరణం. ఇది సర్వవ్యాపి; అజేయము; అవినశ్వరము. దీనిమోహంతోనే పట్టణాల్లోని స్త్రీలు సాయంకాలం అలంకరించుకొని రాజమార్గంపై వున్న కిటికీదగ్గర నిలబడతారు; శాకినీ, మోహినీ, మొదలైన దొంగవేషాలతో చీకటిరాత్రిళ్లు నిర్జనస్థానంనుండా ఒంటరిగా పోతున్న పథికులదృష్టిని ఆకర్షిస్తారు. ముక్తితృష్ణకంటె కూడా ఈతృష్ణ బలవత్తరమైన దని బుధుల అభిప్రాయము; ఇదే ఆత్మకు ప్రథమప్రవృత్తి. చనిపోయినవిూదట కూడా స్త్రీ పురుష భేదాలు ఉండటాన్ని బట్టి మనకు ఏమి తేలుతుం దంటే—"

"ఇలా నిన్ను చెప్పకుపోనిస్తే లాభం లేదు. ఉపన్యాసం కట్టిపెట్టి, ఇక అవసరమైనసంగతులు మాట్లాడు. ఇప్పుడు ఏమిచేయాలని నీఉద్దేశం ?"

ప్రేతం చేతులు జోడించి "దేవా! భోగంవల్లనే నివృత్తి కలుగుతుం దని విన్నాను. తృప్తివల్లనే తృష్ణ లయిస్తుంది" అన్నది.

శాస్త్రముఖంవిూద కరుణహాసం తొలుకాడింది. నిట్టూర్చి "అయ్యో! దురదృష్టవంతురాలా, ఇప్పటికీ నీకు చైతన్యం కలగలేదా? నే నింకా ఏమి చేసేది?" అన్నాడు.

"మహాప్రభూ! ఏ ఉపాయంతో, నాకు ఎప్పుడు ముక్తి కలుగుతుందో చెప్పండి?"

"అదే చెప్పలేకుండాఉన్నాను. తృప్తిద్వారా తృష్ణను లయం చేయబోయి, ఆఖరికి నీవు ఏది చేసినా ఏది చేయకపోయినా, సృష్టివిలయానికిమాత్రం తోడ్పడతావేమో నని నాకు సందేహంగా ఉన్నది. సరే, ఏదైనా కానీ, నీకు నేను మాట ఇచ్చిఉన్నాను కాబట్టి నాకు చెప్పకతప్పదు."

"చెప్పండి, మహాప్రభూ !"

శాస్త్ర క్షణకాలం ధ్యానస్థుడై ఇలా చెప్పినాడు "ఉత్తరకాలంలో ఈదేశాన 'తృప్తివల్లనే తృష్ణ లయిస్తుంది' అనేవాదం బాగా ప్రచారం కాబోతున్నది. అప్పుడే విూకుకూడా, కావలసినంత తృప్తి వెదుక్కోటానికి వీలు చిక్కుతుంది."

"ఎలాగు ?"

"రసస్రష్టలను ఆవేశించండి."

"మగవాళ్లనా !"

"ఆఁ! ఎందుకు, అంత అమాయకత్వం చూపిస్తావు? పురుషస్పర్శగా విూకు కావలసింది! సరే, కాలాన్ని బట్టి, వెదికితే కొంతమంది స్త్రీలుకూడా చిక్కవచ్చును. వాళ్లమస్తిష్కంలో ప్రవేశించి, విూరు వారి మానసకన్యారూపంతో వారు రచించే కథలలో నాయికలుగా పుట్టండి. ముద్రాయంత్రాలుకూడ విూకు సహాయపడతవి. ఆస్థితిలో, తృప్తిని వెదకటానికి విూకు కావలసినంత వీలు చిక్కుతుంది. ఆ అచ్చయిన కథలపుస్తకాలు తగలబడికానీ చిరిగికానీ నశించటంతోపాటు విూక్కూడా విలయం సంభవిస్తుంది. అదే విూకు ముక్తి."

"అ దింకా చాలా కాలానికిగా !"

"దేనికి అంత ఉత్కంఠత ? నిజంగా, ముక్తికోసమా, లేక నీతృప్తి తీరేసుయోగం ఎప్పటికోకాని రాదనా ?"

"అయితే నే నిక వెళ్లవచ్చునా, మహాప్రభూ?"

"ఆఁ. ఇంకోమాట — ఈ ప్రపంచంలో ఉన్న ప్రేతా లన్నిటినీ, వెతికి, ఈమాట చెప్పటానికి నాకు తీరిక లేదు ; ఆపని నీవే చేయి, పో."

వాకిట్లో ఉన్న మామిడిచెట్టుకొమ్మ ఒకటి ఫెళ్లున విరిగిపడింది. గోపాలునిభార్య మూర్ఛిల్లింది.


శాస్త్ర గోపాలునితో— "మూర్ఛ త్వరలోనే తెలుస్తుంది. కాని రోగి చాలా నీరసంగా ఉంటుంది." అని శుశ్రూష చేయవలసినవిధం చెప్పినాడు. స్మృతిరాగానే గోపాలునిభార్య చకితురాలై నాలుక కొరుక్కుని, ముసుకు లాగి ఇంకోగదిలోకి వెళ్ళిపోయింది.

శాస్త్ర "ఇక దిగులుపడవలసినపని లేదు. నా అనుచరులు ధర్మశాలలో నాకోసం ఎదురుచూస్తున్నారు. నీవు ఎవరిద్వారానైనా వారికి కబురుచేయి" అని గోపాలునికి చెప్పినాడు.

కొంచెంసేపటికే అనుచరులు గోపాలుని ఇంటికి వచ్చినారు. అప్పుడు శాస్త గ్రామంలో ఉన్నవారి నందరినీ పిలిపించి, వారికి చాలాసేపు ఇంద్రియనిగ్రహాన్ని గురించి ఉపదేశించాడు. వారందరికీ నమ్మకం కుదరటానికిగాను ప్రేతానికి సంబంధించినకథ యావత్తూ చెప్పినాడు. చివరకు గోపాలునితో — "సాయంత్రం అయింది. ఇక నేను వెళ్లుతున్నాను. ఓ, గోపాలుడా! నిగ్రహం లేకపోవటంవల్ల ఎటువంటిఫలితం కలుగుతుందో నీవు కళ్లారా చూచినావు. నీ కింకా కొత్తగా ఏమి చెప్పేది? నీవుమాత్రం ప్రవృత్తికి దాసుడవు కావద్దు. చూడు, ప్రేతంముందు నీ నిష్ఠను ప్రశంసించాను. అంతమాత్రంచేత నీ ఆచరణను నేను సమర్థించానని, నీవు సంతోషించవద్దు; ప్రేతాన్ని లొంగదీయటంకోసమే నే నలా నటించాను. నిజంగా, నీ వప్పుడు స్త్రైణుడిమాదిరిగా ప్రవర్తించావు; అది స్వాభావికబుద్ధికి లక్షణం కాదు; భార్యదేహంమీద ఎక్కువ వాత్సల్యం చూపించటం కామప్రవృత్తిని ఒకవిధంగా వెల్లడించటమే."

ఇంకా యిలాంటి అమూల్యవిషయాలు అనేకం ఉపదేశించి శాస్త అక్కడినుంచి వెళ్ళిపోయినాడు.

గోపాలుడు నిట్టూర్చి "బ్రతికాను, బాబూ!" అనుకున్నాడు.1



---

1. అతృప్తివల్ల ముక్తికి విఘ్నం ఘటిల్లుతుంది అనేది ప్రాచీనవాదమే జాతకకథల్లో అనేకచోట్ల ఈ విషయం కనపడుతుంది.

ప్రేతాలు ఎక్కువగా నవోఢలనే ఆవేశిస్తూ ఉంటవి. ఈ సంగతి ప్రతి పల్లెటూరిముసలమ్మకీ తెలుసును. అందుచేతనే, ముసలమ్మలు మిట్టమధ్యాహ్నమూ, సందెవేళా పిల్లలను ఇంట్లోనుంచి కదలనివ్వరు.

కామప్రవృత్తినిగురించి ఈకాలంలో చాలా పరిశోధన జరుగుతూఉన్నది. ఫ్రయిడ్, ఎలిస్ మొదలైన విద్వాంసులు పుస్తకాలు రచించకముందు 'సెక్సు'కు సంబంధించినచర్చ జరిగిఉండదని చాలామందినమ్మిక. ఈకథను 'శ్రీ. చిత్రో' పత్రికవారు చాలాశ్రమపడి, ప్రాచీనగ్రంథాల్లోనుంచి సేకరించి ప్రకటించినారు. ఇందులో చివరిభాగం మినహా అంతా మూలంలో ఉన్నదే. నే నిది ఆ పత్రికనుంచే అనువదించాను.—'చక్రపాణి'.